# ట్రోఫీ

మగరాయుడు అని పిలవబడే ఆరతి కోర్టుబోనులో నిలబడి ఉంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీంద్ర ఋజువు చేయాలని ప్రయత్నిస్తున్న అంశం అది రేప్ కాదని. అందుకీ ప్రయోగం చేస్తున్నానని కోర్టు అనుమతి తీసుకొన్నాడు.

'ఆరతీ! ఈదారం తీసుకో' తీసుకోలేదు. 'మర్యాదగా మాట్లాడమని మీకు చాలాసార్లు చెప్పాను. మీరు మర్చిపోతున్నారు.'

'ఆరతిగారూ! ఈ దారం తీసుకోండి' ఇచ్చాడు. తీసుకొంది.

'సూదిబెజ్జంలోకి దారం ఎక్కించండి!'

ఆరతి చేతిలో దారం ఉంది. రవీంద్ర చేతిలో సూది ఉంది. అరడుగుల ఎత్తున్న రవీంద్రకు దాదాపు అంత ఎత్తుగానూ ఉన్న ఆరతి చేయి రవీంద్ర చేయి ఒకేచోట ఉన్నాయి.

సూది బెజ్జంలోకి ఆరతి దారం ఎక్కించబోతూ ఉంది. రవీంద్ర చేయి కదుపుతూ ఉన్నాడు. దారం ఎక్కించలేకపోతూ ఉంది.

'చేయి కదుపుతూ ఉంటే దారం ఎక్కించడం సాధ్యంకాదు' అంది.

'అయితే మీరే ఎక్కించండి' అని సూది ఆమెకిచ్చాడు. సూదీ దారం రెండూ రెండుచేతులతో పట్టుకొన్న ఆరతి క్షణంలో దారం సూది బెజ్జంలోకి ఎక్కించింది.

'మైలార్డ్ సూది స్త్రీ, దారం పురుషుడు, సూది కదిలితే దారం ఎక్కదు. సూది ఊరకే ఉంటే దారం ప్రవేశిస్తుంది. కదలటం అంగీకారం లేకపోవటం. ఊరికే ఉండటం అంగీకరించటం. రతికార్యం జరిగింది కనుక అది అంగీకారంతోనే జరిగిన చర్య. కాబట్టి రేప్ కాదు.'

కోర్టు హాలులో అందరూ చప్పట్లు కొట్టారు. ఆడన్యాయవాదులు సిగ్గుతో తలదించుకొన్నారు. మగవాళ్ళు అత్యుత్సాహంగా నవ్వుతున్నారు.

ఆరతి మండిపోతూ ఉంది. తలదించుకోలేదు, తలపైకెత్తి అందరినీ చూస్తూ ఉంది. పబ్లిక్‌ప్రాసిక్యూటర్ రవిని చూచి నవ్వింది. రవి వణికిపోయాడు.

కోర్టు హాలులో అల్లరిగా ఉంటే న్యాయమూర్తి 'ఆర్డర్! ఆర్డర్!!' అని సుత్తెతో కొట్టాడు.

కోర్టు నిశ్శబ్దం.

ఆరతి పెద్దగా నవ్వింది.

తలవంచుకొని నోట్సు వ్రాసుకొంటున్న న్యాయమూర్తి తలెత్తి చూశాడు.

'మైలార్డ్' అంది ఆరతి. ఏమిటి, అన్నట్లు చూశాడు. 'సూది దారం పోలిక తప్పు'

'మరి ఏది ఒప్పు?' న్యాయమూర్తి అడిగాడు. 'నా నిర్దోషిత్వం నిరూపించుకోవటానికి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రయోగం అనుమతించినట్లే. నేను ప్రయోగం చేయటానికి అనుమతించాలి.'

కోర్టు హాలు నిశ్శబ్దంగా ఉంది. ఆరతి తరుపు న్యాయవాది గబగబా ఆమె దగ్గరకు వచ్చాడు. ఆమె పక్షాన జడ్జిని అనుమతి కోరాడు.

జడ్జి అంగీకరించాడు.

'రేపటికి వాయిదా కావాలి!'

'ఎందుకు?'

'సూది, దారం వంటి ప్రయోగసామగ్రి నేనూ తెచ్చుకోవాలి కదా!'

జడ్జి కేసు వాయిదా వేశాడు.

'ఆరతీ! కేసునుంచి తప్పించుకోలేవు' అన్నాడు రవీంద్ర వెళిపోతున్న ఆరతితో.

'నన్ను దోషిగా నిరూపించాలని ప్రయత్నించే మీ పట్టుదలను హర్షిస్తున్నాను. మీ తెలివితేటల మీద నాకు ఏమీ నమ్మకం లేదు'

ఇద్దరూ చెరో తోవన వెళిపోయారు. రవీంద్ర రెచ్చిపోయాడు. ఆరతి తీక్షణంగా ఉంది. రవీంద్ర బాడి బిల్డర్. సంపన్నుడు. ముప్పై ఏళ్ళ వయస్సు. పెళ్ళి కాలేదు. పలుకు బడితో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అయ్యాడు.

ఆరతి ఆరడుగుల అందగత్తె. మంచి ఆటగత్తె. చిన్నపిల్లగా ఉన్నప్పుడు మగపిల్లలతో చెడుగుడు ఆడింది. ఆడపిల్లల ఆటలన్నింటిలో బహుమతులన్నీ ఆమెవే! ఆమెకు సమ ఉజ్జీలు లేరు. పోటీ లేదు. ఫుట్‌బాల్,. వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబాడి ఆడపిల్లలు ఆడరు. అయినా జట్లు ఏర్పరచి ఆటలు ప్రారంభించింది,. వాళ్ళు ఆడలేరు. పోటీగా అసలు ఆడలేరు. కారెమ్స్, చెస్, త్రోబాల్, బేడ్‌మింటన్‌లో కూడా పోటీలేదు. పోటీలేందే ఆటలో రంజులేదు. తానే గెలుస్తుంది కాబట్టి, ఆమె వస్తుంటే ఆడపిల్లలు ఆడటం మానేసేవాళ్ళు. తనతో ఆడేవాళ్ళు లేక, మగపిల్లల్ని చాలెంజి చేసేది. వాళ్ళమీదా గెలిచేది. మగపిల్లలు అందరూ కూడా ఆమెతో ధైర్యం చేసి ఆడేవాళ్ళుకారు. ఓడిపోతామని భయం. పరుగుపందెంతో మగపిల్లల్ని ఓడించింది. లాంగ్‌జంప్, హైజంప్, పోల్‌వాల్ట్ మగపిల్లలు గెలిచేవాళ్లుకారు.

స్కూలు బహుమతులు, జూనియర్‌కాలేజీ బహుమతులు, డిగ్రీకాలేజీ, యూనివర్శిటి బహుమతులు రావటమే కాదు. చాంపియన్‌గా ఉండేది. ఆమె ఏ ఆటల్లోనైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఉంటే, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రఖ్యాతి సంపాదించి ఉండేది. గేమ్సూ

స్పోర్ట్సు ఆడే ఆరతి, చదువులో బెస్ట్. ఆటలు శరీరానికి, చదువు బుద్ధికి బలం ఇస్తాయని నమ్మేది. లాయరు కావాలని ఆమె కోరిక. స్త్రీలకుజరిగే అన్యాయాలను తన పరిధిలో న్యాయవాదిగా కోర్టులో అరికట్టాలని ఆశించేది.

ఆరతి మంచి మాటకారి. కబుర్లు బాగా చెప్పేది. ఆడపిల్లల్ని పోగేసి, జాతీయ అంతర్జాతీయ రాజకీయాల మీద ఉపన్యాసాలిచ్చేది. ఎవరినీ తూలనాడేది కాదు. మగపిల్లల్ని ఎగతాళి చేసేవాళ్ళని మందలించేది. లెక్చరర్ల పాఠాలమీద కామెంటు చేస్తే వాళ్ళ శక్తి అంతే! మిగతాది మనం చదువకోవాలనేది. ఆమె మాటలు కూడా మగపిల్లలకు ఇష్టమే! వాళ్ళతో వాదించి వాళ్ళను ఒప్పించేది. అన్యాయం సహించేదికాదు. న్యాయంకోసం వాదించేది. పోరాడేది. పౌరహక్కులు, ప్రాథమికహక్కులు మానవహక్కులు, సాంఘికన్యాయం, సమాజచైతన్యం, ప్రజాస్వామ్యం, ప్రజలు - జాగృతి, మానవసమానత్వం, స్త్రీపురుష సంబంధాలు, స్త్రీపురుష సమానత్వం వంటి అంశాలమీద సుదీర్ఘంగా మాట్లాడేది. డిబేటుల్లో పాల్గొనేది. బహుమతులు సంపాదించేది.

ఆడపిల్లలు, అందచందాలు, గాజుపూసలు, చీరెలు జాకెట్టులు, నగానట్రా షోకులు, లిప్‌స్టిక్కులు పాలీషులు గురించి మాట్లాడుతుంటే నోరెళ్ళబెట్టి వినేది. సినిమా హీరోలూ, హీరోయిన్లు, సంగతులు పట్టించుకొనేది కాదు. నువ్వు రాజకీయాలలో చేరితే అత్యున్నత పదవుల పొందగలవంటే నవ్వి, ప్రియాంకకు పది పర్సెంటు తెలివి, ఆలోచన, సామర్థ్యం ఉంటే ప్రధానమంత్రి కాగలదు. అదే నయింటీ పర్సెంటు ఉన్న ఎవరూ కూడా ఆ దరిదాపుల్లోకి పోలేరు. మన ప్రజాస్వామ్యం పరిధి పరిమితి అర్థంకావాలి' అని ఊరుకొనేది. 'న్యాయవాది కావాలి. అదృష్టం బాగుంటే ఎంత దాకా అయినా ఎదగవచ్చు. మన ప్రజాస్వామ్యం పరిధులు పరిమితులకు లోబడి' అని నిశ్చయించుకొంది.

ఆరతి ఆడపిల్లగా అద్భుతమైన ఆకారం. మంచి ఆకర్షణ. సహజసౌందర్యం. అలంకరణలు సొమ్ములు, అవతారపు చేష్టలు ఏమీలేవు. అనవసరపు సిగ్గూ బిడియం లేవు. అణుకువ ఉంది. మగపిల్లల పనులు ఆడపిల్లల పనులు అన్నీ ఒద్దికగా చేస్తుంది.

తన తల్లిదండ్రులకు తానొక్కతే సంతానం. అందువల్ల ఆరతే ఆడపిల్ల. ఆరతే మగపిల్లవాడు. జడలేదు. ముడిలేదు. అంత పొడుగూలేదు, మగపిల్లల్లాగా పొట్టీ కాదు, జుట్టు. ముక్కు కుట్టలేదు. చెవి కుట్టలేదు. మెళ్ళో దండవేయదు. నెత్తిమీద పూలు నిలవ్వు. ఒక చేతికి వాచీ, మరోచేతికి బ్రేస్‌లెట్. గాజుల్లేవు. నోస్నో. నో పౌడరు.సబ్బుతో ముఖం కడుక్కోవటమే ఆరతి అలంకరణ. బంగారు రంగుమీద ఏ అలంకారాలు నిలుస్తాయి. జీన్స్, పేంట్ షర్టు ఇష్టం. పంజాబి డ్రెస్సులు బాగుంటాయి. వాళ్ళ అమ్మ ఇష్టం, చీరె జాకెట్టు! వాళ్ళ నాన్న ఇష్టం, లంగా ఓణీ! అన్నీ నప్పుతాయి. ఎప్పుడూ మగపిల్లవాడిలాగా ఉండే ఆరతి వంట చేసేటప్పుడు అసలు సిసలు ఆడపిల్లలాగా అట్లకాడ తిప్పుతుంది.

ఆరతి లాలో చేరిందాకా అందమయిన ఆడపిల్లే! అయితేనేం! యూనివర్శిటీ లా డిపార్టుమెంటులో అంత చక్కని స్త్రీ ఇంతదాకా లేదని అందరూ అనుకొనేవాళ్ళు. మగరాయుడిలాగా ఎగురుతూ తిరిగే ఆరతిలో ఏం జరిగిందో తెలియదు. ఎక్కణ్ణుంచి ప్రవేశించిందో తెలియదు. అదేమిటో తెలియని ఆడతనం ఆమెలో విచిత్రంగా ప్రవేశించింది. ఆమె పెద్ద ఆకర్షణ అయిపోయింది. దీపం చుట్టూ పురుగులు లాగా మగపిల్లలు గుంపులు గుంపులు ఆమెచుట్టూ చేరేవారు. ఆటల్లో మగపిల్లలతో జట్టు కట్టిన ఆరతి అకస్మాత్తుగా మగపిల్లలకు దూరం కాసాగింది. ఆ ఒద్దిక ఆరతిలో మరింత ఆకర్షణకు కారణమయింది. ఆమె ఆడపిల్లల్లో ఉంటే మాత్రమేకాదు మగపిల్లల్లో కూడా మగరాయుడుగానే ఉండేది. ఆమె అంత ఎత్తూలావూ ఉన్న మగవాళ్ళు ఎవరో ఒకరూ ఇద్దరు! వాళ్ళు ఆరతి శారీరక మానసిక ధాటిక తాళలేక తప్పుకు పోయేవాళ్ళు. ఆమె అందం, ఆకర్షణ వ్యక్తిత్వం అర్థం చేసుకోగలిగే అర్హత ఉన్న మగపిల్లలు ఆమెకు కనిపించలేదు.

అందరూ ఆమెను ఆశ్చర్యంగా దూరం నుంచి చూస్తారు. దగ్గరకు రారు. ఎదుటపడరు. ఆరాధిస్తున్నవాళ్ళు కూడా మాట్లాడటానికి భయపడుతున్నారని గుర్తించి, తన స్త్రీత్వం పట్ల గర్వం ఏర్పడి, తన వ్యక్తిత్వం పట్ల అహంకారం పెరిగింది.

చక్రి ఆరతిని ఆరాధనగా చూచేవాడు. ఆశ్చర్యంగా వెంటపడేవాడు. ఆరతి గుర్తించింది. 'కీటకం' అనుకొంది. 'పురుగు' అనుకొంది. ఎందుకో ఇష్టంకాలేదు. ఆరతి లెక్కచేయలేదు.

చక్రి బక్క పీనుగ. గాలితోలితే పడతాడు. ఐదున్నరడుగులు ఎత్తుంటే ఎక్కువ. సంపన్నుడు. ఖరీదైన మనిషి. ఆరతి గుణగణాలతో వేటికీ సరితూగడు. అతడంటే ఆమెకు చులకన భావం ఏర్పడింది. త్రోబాల్‌లాగా అతణ్ణి దూరంగా విసిరేయగలనని, షాట్‌పుట్‌లాగా గీత అవతల త్రో చేయగలనని అనుకొని నవ్వేది.

స్నేహతురాళ్ళతో లైబ్రరీలో కూర్చున్న ఆరతి దగ్గరకు చక్రి వచ్చాడు.

'ఆరతి!' అన్నాడు.

చికాకుగా, చీదరింపుగా చూచింది.

'మాట్లాడాలి!'

'మాట్లాడు!' అంది.

'ఏకాంతంగా!'

అమ్మాయిలు లేచి పక్కకు వెళిపోయారు,

'నువ్వు నాకిష్టం'

అతడి యోగ్యతల్ని గూర్చి ఆమె ఆలోచించసాగింది.

'నిన్ను ప్రేమిస్తున్నాను?'

'నువ్వా?'

'ఊఁ!'

'నన్నా?'

'ఊఁ!'

'ప్రేమా?'

'ఊఁ!'

'నన్నేం చేసుకొంటావ్?'

'పెళ్ళి!'

పెళ్ళున నవ్వింది ఆరతి. యూనివర్శిటీ లైబ్రరీలో అంత పెద్దగా ఎవ్వరూ నవ్వరు. అందరూ అటు చూశారు.

'నాకిష్టం లేదు!' చెప్పింది.

'ప్లీజ్!'

'నాకిష్టంలేదు, అందరూ చూస్తున్నారు. దయచేసి వెళ్ళిపోండి.'

'ప్లీజ్!'

'ఈ విషయం మర్చిపోండి. దయచేసి వెళ్ళిపోండి. ప్లీజ్!'

'ప్లీజ్!'

'ప్లీజ్!'

'ప్లీజ్!'

చక్రి వెళ్ళిపోయాడు. ఆరతి అవమానంగా భావించింది. సిగ్గుతో తలదించుకొంది. చక్రి తనతో ఇలా మాట్లాడటమే అవమానంగా, అపరాధంగా భావించింది.

వాళ్ళు క్లాసుమేట్సు, కానీ ఈడూజోడూ కారు. ఆమె బలవంతురాలు. అతను బలహీనుడు. అంత చిన్నసైజు మనిషి. ఇంతపెద్దసైజు మనిషిని కోరటం చిత్రమే! మన్మధుడి మాయమర్మాలకు మందులులేవు. మర్యాదలు లేవు. హద్దుల్లేవు. అవధుల్లేవు. ఎవరిని చూస్తే ఎవరికి ఏ కోర్కెలు ఎందుకు పుట్టిస్తాడో చెప్పటానికి – తర్కించటానికి వీలులేదు. చక్రి ఆరతి ధ్యాసలో పడిపోయాడు. ఆరోజు అవమానం మర్చిపోయే ప్రయత్నంలో ఆమె ఉంది. చక్రికి ఆమె తిరస్కారం ఆగ్రహం తెప్పించలేదు. ప్రేమ పెంచింది. ఆమె ధ్యాసలో పడిపోయాడు. మన్మధుడి విచిత్రవేషాలు చరిత్ర పొడుగునా సాక్ష్యాలే. మన్మధుడి మాహాత్మ్యాలు దేవుళ్ళకే అర్థం కాలేదు, చక్రి ఎంత?

ఒకడు ప్రేమించాననటం పెళ్ళిచేసుకొంటాననటం కొత్త అనుభవం. కానీ చక్రిని తలుచుకుంటే గొంగళిపురుగునో, బొద్దింకనో చూచినంత, తాకినంత అసహ్యం, కాలం గడుస్తున్న కొద్దీ ఆమె అతణ్ణి మర్చిపోసాగింది.

చక్రి మర్చిపోలేదు. రోజు రోజుకూ కోర్కె బలంగా స్థిరంగా, పటిష్ఠంగా పెరుగుతూ వచ్చింది. కాలేజీకి రావటం లేదు. క్లాసుల్లో కనిపించటంలేదు. ఎక్కడెక్కడో తిరుగుతూ ఉన్నాడు. ఆమె అతణ్ణి దాదాపు మర్చిపోవటమే కాక, ఇతరుల్తో పోల్చి ఇతను ఈవిధంగా యోగ్యుడు, అయోగ్యుడు అని యువకుల్ని అంచనా వేసుకోసాగింది.

ఆరతి తల్లిదండ్రులు కూతురు పెళ్ళి కోసం తగిన జోడును వెతకసాగారు. చక్రి వెళ్ళి తనను తాను వాళ్ళకు పరిచయం చేసుకొన్నాడు. అతణ్ణి చూచిన తర్వాత చెప్పే ఏ విషయం వాళ్ళు వినదలుచుకోలేదు. పిల్లవాడి ఆకారమే వాళ్ళకు నచ్చలేదు. కానీ అన్ని మర్యాదలు చేసి, చక్కగా మాట్లాడి 'ఆరతితో మాట్లాడి చెబుతామ'న్నారు. ఆమెతో వాళ్ళు ఏమీ మాట్లాడలేదు. అతనికేమి చెప్పలేదు. క్రమంగా అతణ్ణీ వాళ్ళు మర్చిపోయారు.

చక్రి బాగా నిరాశకు గురి అయ్యాడు. తిండీ తీర్థం మానేశాడు. గడ్డం తల పెరిగిపోసాగాయి, అతడి కోరికలాగా గుబురుగా, గరుగ్గా, నల్లగా, ముళ్ళులాగా.

ఆరతి స్కూలులో ఉండగా తల్లిదండ్రులు సైకిల్ కొని ఇచ్చారు. సైకిలింగులో మగ పిల్లలతో పోటీ పడి గెలిచింది. జూనియర్ కాలేజీలో చేరగానే స్కూటర్ కొంటే రెండేళ్ళు గొణుగుతూనే ఇంటరుపూర్తి చేసింది. డిగ్రీలో చేరగానే మోటార్‌సైకిల్ కొనిపించుకొని గొణుగుడు మానేసింది. లాలో చేరగానే కారు కొన్నారు. ఆరతి ఏక్సిడెంట్లు చేయలేదు. కానీ ఆమె స్పీడ్‌కి ఎక్కడివాళ్ళు అక్కడ తోవ ఇచ్చి తప్పుకొనేవాళ్ళు. రాష్ట్రపతి, గవర్నరు, పియం. సియం వస్తుంటే రోడ్లు నిర్మానుష్యంగా అయినట్లుగా ఉండేవి ఈమె కారు హారను వింటే రోడ్లు.

ఆమె కారు రేసులో పాల్గొనలేదు కానీ పాల్గొని ఉంటే ప్రయిజు తెచ్చేది. అంత స్పీడు ఆరతికి బ్రేకులు జాలి దయ. కుంటివాళ్ళు, గుడ్డివాళ్ళు రోడ్డుకు అడ్డమయితే ఆపి, కారులో ఎక్కించుకొని వాళ్ళు చేరవలసిన చోట దించి వచ్చేది. క్లాసుమేట్లు యూనివర్శిటీ పరిచయస్థులు లిఫ్టు అడిగినా ఇచ్చేది.

ఆరోజు ఆరతి చాలాసేపు లైబ్రరీలలో చదువుకొంది. ఏడుగంటలు అయింది. చీకటి పడుతున్నట్లుగా ఉంది. తొందరగా ఇల్లు చేరాలని కారు స్టార్టు చేసింది.

లాకాలేజీ కొండమీద ఉంది. పట్టణమంతా కొండదిగువన ఉంది. పట్టణం దాటితే మళ్ళీ అవతల కొండ. నిజానికి పట్టణం లోయలో ఉంది.

పట్టణానికి పోయే యూనివర్శిటితోవలో పెద్దగా ట్రాఫిక్కు ఉండదు. విద్యార్థులు వెళిపోతే రోడ్డుమీద రాకపోకలు తగ్గిపోతాయి. సహజమయిన స్పీడులో కారు నడుపుతూ ఉంది ఆరతి.

దూరంగా రోడ్డు మధ్యలో పట్టణం వైపు పోతున్న కారు ఆగిపోయింది. కారు ట్రబుల్ ఇచ్చినట్లుంది. డ్రైవరు లిఫ్టు అడుతున్నట్లుగా చేయి చూపుతున్నాడు. కారు పక్కనే కారు ఆపుతూ మనిషిని చూచింది. చక్రి.

చక్రి దేవదాసులాగా గడ్డం పెంచాడనీ, పిచ్చివాడిలా తల జుత్తు పెరగనిచ్చాడనీ, తాగుబోతు మాదిరిగా తాగుతున్నాడనీ, మాటకీ చేతకీ పొంతన లేకుండా ప్రవర్తిస్తున్నాడనీ, చదువు మానివేశాడనీ అరతి విందికాని మనిషి అలా లేడు.

క్రాపు చేయించుకొన్నాడు. గడ్డం గీయించుకొన్నాడు. తాగుబోతులాగా లేడు. టక్ చేసుకొన్నాడు. బూటు టో మెరిసేటట్లు పాలీషు చేయించుకొన్నాడు, చేతుల్లో పుస్తకాల పొత్తులు పట్టుకొని ఉన్నాడు.

ఆరతిని చూచి 'మీరా? వెళ్ళిరండి అయామ్ సారీ!' అన్నాడు.

'ఏమయింది?'

'కారు ట్రబుల్!'

'లిఫ్టు కావాలా?'

'మీరు వెళ్ళిరండి! ఎవరయినా వస్తారు లెండి, వాళ్ళను లిఫ్టు అడుగుతాను!'

ఆరతి కారు డోరు తీసింది. 'ఫరవాలేదు రండి' అంది.

తటపటాయిస్తూ కారెక్కాడు. కార్లో కూర్చోగానే స్టార్టు చేసింది.

'కాలేజీకి రావటం లేదా?'

'రాబుద్ధి కావటం లేదు'

'ఎక్కణ్ణుంచి వస్తున్నారు?'

'లైబ్రరీ నుంచి!'

'మీ చదువు మీరు చదువుకోండి. మీ జీవితం మీరు తీర్చిదిద్దుకోండి. నా ఆశలు వేరు. ఆకాంక్షలు వేరు. ప్రేమ, పెళ్ళి అంటే నాకు కోపం వచ్చింది కాని, క్లాసుమేటుగా పరిచయస్థులుగా మీరంటే నాకేం ఇబ్బంది లేదు.'

'అబ్బే అదేం లేదండి. అదంతా నేను మర్చిపోయాను.'

'ఘంటు తన పక్కనే కూర్చున్న చక్రి తాగి ఉన్నాడేమోనని వాసనను బట్టి అనుమానం వచ్చింది. అతడివైపు దగ్గరగా చూస్తే మత్తుగా అనిపించింది. అతను తన తల పట్టుకొంటున్నట్లుగా ఉంది. మగతగా, నిద్రగా, మత్తుగా వాసన.

ఆరతి నడిపే కారు ఆగిపోయింది. చక్రి, ఆరతి సీట్లు మారారు. కారు పట్టణం దాటింది. కొండెక్కింది. గెస్ట్ హౌసుకు చేరింది.

వాచ్‌మెన్ నమ్మిన బంటు. నలభై ఏళ్ళుగా పనిలో ఉన్నాడు.వంట చేయగలడు నమ్మకస్థుడు. చెప్పినపని, మాట, జవదాటడు.

చక్రి, వాచ్‌మెన్ ఇద్దరూ ఆమెను దించి బెడ్‌రూంలో మంచం మీదికి చేర్చటానికి నానా అవస్థలు పడ్డారు.

ఎనిమిది అయినా కూతురు ఇంటికి రాకపోయేసరికి తల్లిదండ్రులు సహజంగానే కంగారు పడ్డారు.

స్నేహితుల ఇళ్ళకు ఫోన్లు చేశారు. ఆమె సెల్లు ఆమె ఎత్తటం లేదు. ఎక్సిడెంటు చేయదు. దొంగలు ఆమెను ఏమి చేయలేరు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాళ్ళు అన్నీ ఆలోచించి చక్రి కిడ్‌నేప్ చేసి ఉంటాడని సందేహించారు. అతడి కారు యూనివర్శిటీ రోడ్డులో మధ్యలో ఆగి ఉంది. చక్రివాళ్ళ గెస్ట్‌హౌస్‌లో ఆరతి కారుంది. ఆమె కనిపించింది. పోలీసులు కిడ్నాప్ కాదన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ కథనమిది. చక్రి తన కారులో వేగంగా యూనివర్శిటీనుంచి ఇంటికి పోతుండగా వెనకనుంచి ఆరతి తనకారులో వచ్చి, అతనికారును దాటేసి, ముందుకొచ్చి, అతడిని ఆపి, ఆగినచోటే కారునుంచి, అతడిని నాతోరమ్మని, తీసుకొని పోయింది. ఎక్కడికి పోదామంటే మాగెస్ట్‌హౌస్‌కి అని అతను సూచించాడు. ఆరతి అతణ్ణి తన కారులో అక్కడికి తీసుకుపోయింది, ఇది ప్రేమబంధం కాని, మానభంగం కాదు. కిడ్నాప్ కాదు, అని కేసు మొదటిభాగం వివరించాడు.

అందుకు పోలీసుల ఎఫ్.ఐ.ఆర్ కూడా సరిపోతూ ఉంది.

కొండమీద గెస్ట్‌హౌస్ దగ్గరకు కిడ్నాప్ ఫిర్యాదు మీద కిడ్నాపర్లను పట్టుకోవటానికి పోయిన పోలీసులతో వాచ్‌మేన్ 'వాళ్ళిద్దరూ కలిసి వచ్చారనీ, ఆమే కారు డ్రైవ్ చేసిందనీ వాళ్ళిద్దరే వచ్చారనీ, నిన్న సాయంకాలం నుంచి ఆ గదిలోనే ఉన్నారని, వాళ్ళు తలుపుతీయలేదని, వాళ్ళకు కావలసినవన్నీ గదిలోనే ఉన్నాయని నాలుగు రోజులున్నా, వాళ్ళకు తలుపుతీయవలసిన అవసరం లేదని' చెప్పాడు.

పోలీసులు తడితే తలుపు తీయలేదు వాళ్ళు. వాకిలి తాళం వాళ్ళదగ్గరే ఉంది. తలుపులు పగులగొట్టి నంత పని చేయగా, బాగాతాగి మూలుగుతూ ఉన్న ఆరతి సింహం లాగా కనిపించింది.

చక్రిని అడిగితే శవాన్ని చూపించింది. ఆమెను పట్టుకొని తీసుకువచ్చి హాస్పటల్ పరీక్షలు చేయించి, అరెస్టు చేసి, బెయిలుమీద విడుదల చేశారు.

శవపంచాయితీ ముగిసింది. గొంతు పిసకటం వల్ల చక్రి చనిపోయాడని పోస్టుమార్టం రిపోర్టు తెలిపింది.

మంచం నాలుగు కోళ్ళకు కట్టిన నాలుగుతాళ్ళు ఉన్నాయి. మంచం మధ్యలో బిగదీసి కట్టిన తాళ్ళున్నాయి.

అరతిని చక్రి కిడ్నాపు చేశాడని కేసుబుక్ చేద్దామని వచ్చిన పోలీసులకు మర్డరుకేసులో అరతిని నేరస్థురాలిగా చేశారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ కథనమిది: తనను అవమానం చేశాడని కోపంతో, పగతో, క్రోధంతో చక్రిని చంపాలని పథకం వేసుకొన్న అరతి అతణ్ణి లాలించి, గెస్ట్‌హౌస్‌కు తీసుకుపోయి, మంచానికి కట్టేసి, గొంతుపిసికి చంపింది.

ఆ ఇరవై నాలుగు గంటల్లో మానభంగం జరిగినట్లుగా ఉన్న మెడికల్ రిపోర్టుకు బదులుగా, చక్రితో శృంగార క్రీడల తర్వాత అరతి అతణ్ణి చంపిందని రవీంద్ర వాదించసాగాడు.

ఇది కిడ్‌నాప్ అవునా? కాదా?

ఇది మానభంగం అవునా? కాదా?

ఈ హత్య ఎలా జరిగింది?

కోర్టులో కేసు జరుగుతూ ఉంది.

'నేనే అతణ్ణి గొంతు పిసికి చంపానని' అరతి పోలీసులతోనూ, ప్రాసిక్యూటర్‌తోనూ చెప్పింది.

పోలీసుల కస్టడీనుండి, జుడీషియల్ కస్టడీకి, అక్కణ్ణుంచి బెయిలుమీద ఇంటికి చేరింది అరతి.

ఆమె అతణ్ణి అకర్షించి తీసుకుపోయిందనటం కంటే అతడే ఆమెను కిడ్నాప్ చేసి తమగెస్ట్ హౌస్‌కు తీసుకుపోయాడనటం కోర్టులో నిలబడేటట్లుగా మారుతూ ఉండటంతో వాస్తవం ఋజువవుతుందని అరతి తల్లిదండ్రులకు ఓదార్పుగా ఉంది.

చక్రి అరతి ఇరవైనాలుగ్గంటలు గెస్ట్‌హౌస్‌లో ఉన్న తరువాత ఆమె అతణ్ణి ఎందుకు చంపింది? ఎవరికీ అంతుచిక్కడంలేదు.

పోస్టుమార్టం రిపోర్టులో చక్రి ఉదయం ఐదు – ఆరు గంటలమధ్య చనిపోయినట్లుండగా చంపానంటున్న అరతి అక్కడనుంచి వెళ్ళిపోకుండా సాయంకాలం దాకా ఎందుకుంది?

ఆమె ఏమీ చెప్పటం లేదు.

విచిత్రమైన ప్రశ్నలకు జవాబులు చెప్పలేక, అంత తెలివైన అరతి మూగబోయింది ఎంత గొప్పగా ఉపన్యాసాలు ఇవ్వగలిగే యువతి నోరు కట్టేసినట్లు అయింది. బెయిల్ మీద ఇంటికి చేరిన అరతి తల్లిదండ్రుల ఆదరణతో గట్టి పడింది. కోర్టు వ్యవహారాలకు గుండె దిటవు చేసుకొంది. అలిసిపోయినా, నీరసపడినా, డసిలిపోయినా, ధైర్యం కోల్పోలేదు. బలహీనురాలుకాలేదు. రాటుదేలిపోయింది.

గోరుచుట్టుమీద రోకటి పోటులాగా మరో సత్యం మూడోనెలకు స్పష్టంగా తెలిసింది. తనకు నెలతప్పింది. తల్లీ తండ్రి బాధపడ్డారు కానీ, ఆరతిని బాధపెట్టలేదు.

చక్రిని అవమానం కారణంగా చంపాలనుకొన్న ఆరతి, అతడు కిడ్నాప్ చేశాడని అనుమానం వచ్చేట్టుగా వాళ్ళ గెస్ట్‌హౌస్‌కి తీసుకుపోయి, తాను కట్టేసి గొంతుపిసికి చంపి, తనను కట్టేసినట్లుగా భ్రమింపచేసింది. రవీంద్ర కథమీద కథ లింకు పెడుతూ వాదిస్తున్నాడు.

అభియోగం ఆమె అంగీకరించలేదు. నోరెత్తకుండా ఉన్న ఆరతి మాట్లాడక తప్పదని గుర్తించింది.

తనకు కారులోనే మత్తు వాసనచూపి స్పృహ లేకుండా చేశాడు.

మత్తులో ఉన్న తనను బెడ్‌మీదికి చేర్చారు. తనకు మెలకువ వస్తున్నప్పుడు తాను కట్టివేయబడి ఉండటం గ్రహించింది. కాళ్ళూచేతులూ నాలుగు మంచంకోళ్ళకు ముడివేయబడి ఉన్నాయి. తల, మెడ, కదలటానికి వీల్లేకుండా గొంతుమీద తాడు కదిలితే కోసుకుపోయేట్టు ఉంది. పొట్టమీద కదిలితే కోసుకుపోయేట్టు కట్టిన తాళ్ళున్నాయి. నడుం కింద దిళ్ళున్నాయి. ఆ రాత్రంతా తనకు మెలకువ లేదు.

సగం మెలకువ, సగం మగతగా ఉన్నప్పుడు తను బంధింపబడ్డట్లు చూచాయగా తెలుసుకోగలిగింది. అప్పుడే తెల్లవారుతూ ఉన్నట్లుగా అనిపించింది శరీరమంతా విపరీతంగా నొప్పులు. తనమీద తనకు అసహ్యం కలుగుతున్నట్లుగా ఉంది. మగతలో కళ్ళు మూస్తూ తెరుస్తూ ఉన్నప్పుడు చక్రి కనిపించాడు. కోపం వచ్చింది. కోపంవల్ల, నొప్పులవల్ల ప్రతి అవయవం భగ్గున మండిపోసాగింది. మానభంగం జరిగిందా అని సందేహం కలిగింది.

చక్రి రోడ్డుమీద కనిపించిన దగ్గర్నుంచి జరిగిన సంఘటనలు అర్థం చేసుకొనే ప్రయత్నం చేసింది. స్పష్టంగా కాదుగానీ, రమారమిగా ఏం జరిగిందో పోల్చుకోగలుగుతూ ఉంది. తాను వెల్లకిల పడుకొని ఉన్నట్లు, లేవలేకుండా ఉన్నట్లు, మంచానికి కట్టివేయబడినట్లు తెలుసుకోగలిగింది. ఎవరి ఇల్లో, ఎవరి మంచమో, ఎందుకిలా జరిగిందో, ఎవరైనా ఎందుకు తనను కాపాడలేక పోయారో, తనను తాను ఎందుకు రక్షించుకోలేక పోయిందో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించసాగింది.

ఆ మగతలోనే చక్రి నవ్వుతుంటే ఆరతికి మంట పుట్టింది. కురుక్షేత్రంలో నవ్వుతున్న దుర్యోధనుడి ముఖంలాగా ఉంది చక్రి ముఖం.

అంతదాకా తన నోట్లో దూది ఉందని ఆరతికి తెలియదు. చక్రి దూది తీసేశాడు. ఆమె మాట్లాడబోయింది. మాట పెగల్లేదు. అరుద్దామనుకొంది. అరిసింది. తన అరుపు తనకే వినిపించలేదు. తాను అరవలేకపోయింది.

తన రెండు చేతులు మంచం కోళ్ళనుంచి విడదీశాడు. చేతులు విపరీతంగా నొప్పి. చేతులు ఎత్తలేకపోయింది. శవంలాగా పడి ఉంది. తాను చనిపోతుంది కాబోలునని

సందేహించింది. చేతులు లేవటంలేదు.

చక్రి విజయగర్వంతో ఉన్నాడు. విర్రవీగుతున్నాడు. బలవంతురాలిని, బలహీనురాలిని చేశానని అతిశయపడుతున్నాడు. పొగరుబోతు గిత్త కొమ్ములు విరిచానని సంతోషపడుతున్నాడు. అవమానించిన ఆరతి పొగరణిచానని ఆనందంతో ఊగిపోతున్నాడు.

చేతులు కట్లువిప్పి, ఏదో చెప్పాడు. ఆరతికి సరిగా వినిపించలేదు. చెప్పరాని మాట మళ్ళీ చెప్పాడు. మాట వినిపించింది. అర్థం కాలేదు. మళ్ళీ చెప్పాడు. కొంత అర్థమయింది. తానా చేతులతో ఏమో చేయాలి. అందుకే చేతికట్లు విప్పాడు.

చక్రి చెప్పిన మాట చేయమన్నపని విని అర్థమయి, ఆరతి మండిపోయింది. లేవబోయింది. కాళ్ళు సహకరించటంలేదు. నడుం కదలటంలేదు. కదిలితే గొంతు కోసుకుపోయేట్లుంది. గొంతుకు కట్టిన తాడును ఉరి తాడు చేసుకోవటం అక్కరలేదనుకొంది. ఏడుపు వచ్చింది. తెల్లవారబోతుంది,. రాత్రంతా మత్తులో ఉన్న తాను పొందిన నరకం ఊహించుకొంది.

చక్రి చెప్పిన పని చేయకపోతే తానే ఆమె రెండు చేతులు పైకెత్తాడు. అవి తోటకూర కాడల్లాగా వేలబడిపోయాయి. తన కోర్కె తీర్చమని, చేతులతో ఏమో చేయమని అడుగుతూనే ఉన్నాడు. బ్రతిమాలుతూనే ఉన్నాడు. ఆరతికి ఓపికలేక, ఇష్టంలేక, కోపంవల్ల, అశక్తతవల్ల, దహించుకుపోతున్న గుండెకు తన శరీరం సహకరించకపోవటం వల్ల మత్తులోనే మగతలోనే ఉంది.

చక్రి కోపం పట్టలేక ఆమె చెంపలు పగలగొట్టాడు. కాలితో తన్నాడు. ఆకలిదప్పులకు ఆమెకు కొంత మైకం వదిలింది. అప్పుడు గుర్తించింది. తన శరీరం మీద బట్టల్లేవని. వళ్ళు పచ్చిపుండులాగా ఉంది. తలమీద బాదాడు. ఎదురొమ్ముమీద గుద్దాడు. మెడవంచాడు. చేతులు విరగదీశాడు. పట్టరాని కసితో మీదికి వచ్చాడు.

తాను అవమానానికి గురికాబోతూ ఉంది. ఆమెకు అర్థమవుతూ ఉంది. ముఖంమీదికి ముఖం రాలేదు. పొట్టి సన్నాసి. పిట్టమనిషి. బక్కజీవి. అయినా మగవాడు. అహంకారం. గొడ్డు స్వభావం.

ఆరతికి అపచారం అర్థంకాసాగింది. తనమీద తనకే అసహ్యంగా ఉంది. చక్రిమీద ద్వేషం, పగ, కోపం, కసి, అసహ్యం, ఆవేదన, ఏడుపు, అసంకల్పితంగానే అతన్ని నెట్టింది. తన చేతుల్లో బలం ఏమయింది? వాణ్ణి ఎందుకు నెట్టలేకపోయింది. తనమీద తనకే రోత.

చక్రి మొండిగా ఉన్నాడు. మూర్ఖంగా ఉన్నాడు. తన రంధిలో తానున్నాడు. తన గుండెలమీద ఉన్న చక్రి మెడ తన చేతుల దగ్గరుంది. అతడు ఆమెను గమనించడం లేదు. ఆమె శక్తిని సరిగా అంచనా వేయలేకపోయాడు. తన శక్తిని గొప్పగా భావించుకోసాగాడు.

చక్రి మెడ ఆమె రెండు చేతులకు దొరికింది. చేతులు బలంగా లేవు. మత్తు ప్రభావంతో

ఊగుతున్నాయి. జారి పడిపోతున్నాయి. చేతుల్లోకి కోపం వచ్చింది. కసి ప్రవహించింది. గొంతు పిసకసాగింది.

అతడి మొండితనం మాయం,. మూర్ఖత్వం పరారు. ఆపద గుర్తించాడు. చేతులు విడిపించుకోబోయాడు. సాధ్యం కాలేదు. అరవబోయాడు. అరుపు బయటకు రాలేదు. గింజుకులాడాడు. ఆరతి పట్టు వదల్లేదు. కాళ్ళు అల్లాడాయి. చేతులు చచ్చుబడ్డాయి. నిగిడాడు. పట్టు సడలలేదు. ఊపిరి ఆడటం లేదు. గిలగిల కొట్టుకొన్నాడు. ఆరతి పట్టు వదల్లేదు. గొంతు పిసుకుతూనే ఉంది. చేతులు ఇనుం ముక్కల్లాగా మారాయి. పట్కార్లులాగా బిగిశాయి. కోపం, కసి, ద్వేషం, అసహ్యం చేతుల్లోకి వెళ్లలోకి, దోసిట్లోకి వచ్చాయి. గొంతు రెండు అరిచేతుల మధ్య అప్పచ్చి అవుతూ ఉంది. చక్రిలో కదలిక తగ్గి, నిగిడి, ఎగిరి మీదపడి కదల్లేదు. అయినా అరతి పట్టు సడలించలేదు. పట్టుతప్పలేదు. అతడు చలనం లేకుండా పడిఉన్నా గొంతు పిసుకుతున్న చేతులు పిసుకుతూనే ఉన్నాయి. నిశ్శబ్దంగా వాలిపోయాడు. అతడి శరీరం చల్లగా అయిందాకా గొంతుమీద చేతుల బిర్రు తగ్గలేదు. మీద వాలిపోయిన చక్రిని విసిరిపారేసింది. మంచం పక్కనే పడింది శవం. తెల్లవారింది.

ఆరతి ఎలా బలం తెచ్చుకొందో. గొంతు తాడు నడుంతాడు, కాళ్ళ కట్లు విప్పుకొంది. కిందపడి ఉన్న చీరె మాత్రం చుట్టుకొంది. లంగా వేసుకోలేదు. జాకెట్టు తొడుక్కోలేదు. లోదుస్తులు ఏమీ వేసుకోలేదు. తానింక బందీ కాదని గుర్తించింది. బంధించిన వాడు నిర్జీవంగా ఉన్నాడని గ్రహించగలిగింది. మత్తు పూర్తిగా వదల్లేదు. స్వేచ్ఛవల్ల నిర్భయం వల్ల, కసివల్ల, హూనమయిన శరీరం వల్ల, బలహీనతవల్ల, తలుపువేసి ఉన్న భద్రతవల్ల, మంచంమీద కూర్చుంది. వాలిపోయింది. నిద్రపోయింది. సాయంకాలం పోలీసులు వచ్చి తలుపులు బాదిందాకా మెలకువలేదు. అప్పటికీ మత్తుగానే ఉంది. తలుపుతీసి మంచంమీద పడిపోయింది.

ఆరతిని పోలీసులు తీసుకుపోతున్నప్పుడు ఆమెకు అన్ని విషయాలు అవగాహనలోకి రాసాగాయి. చక్రి చనిపోయాడు. అతడు చనిపోకపోతే తాను చనిపోయేది. వాడు చావకపోతే తనకు చావు మూడుతుంది. చనిపోయాడని నిర్ధారించుకొన్న తరువాత ఆరతికి ఉపశమనం కలిగింది.

శరీరం అంతా నొప్పిగా ఉంది. అయినా మనస్సు ప్రశాంతంగా ఉంది. ఏ భ్రాంతీలేదు. ఏభయమూ లేదు. మొండితనం ప్రవేశించింది. మనిషి గట్టిగా అయినా, ఎక్కడో మెత్తగానే ఉంది.

'వాడు చచ్చాడా లేడా?' అని పోలీసుల్ని అడిగింది. చనిపోయాడని విని ఆనందపడింది.

మూణ్ణెల్లు గడిచాయి. ఆరతి గర్భవతి అని అందరికీ తెలుసు. తను మత్తులో అచేతనంగా పడి ఉన్నప్పుడు జరిగిన విద్రోహం వల్ల తాను గర్భం ధరించినట్లు ఆమెకు స్పష్టమయింది. కోర్టు బంధుమిత్రులు గర్భం ఆరోజు ఫలితమేనని విశ్వసించారు.

ఆమెకిప్పుడు ఎవరిమీదా కోపం లేదు. పగాలేదు. అసహ్యమూలేదు. తనమీద తనకు రోతలేదు. చింతలేదు.

కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడిగాడు.

'ఎబార్షన్ చేయించుకొంటున్నారా?'

'ఎందుకు?'

'కన్నెగా ఉండటానికి!'

'ఎందుకూ?'

'ఎవరైనా పెళ్ళిచేసుకోవటానికి!'

'ఎవరు చేసుకొంటారు?'

'ఎవరైనా! తల్లి శిక్ష బిడ్డకు పడరాదు. బిడ్డ నేరం చేయకపోయినా, తల్లితోపాటు, పుట్టగానే, కడుపులో ఉండగానే శిక్ష పొందరాదు. జైలులో పుట్టి నేరం చేయని ప్రాణి శిక్ష పొందరాదు.'

'నాకు శిక్షపడదు. నేను చక్రిని చంపాను. నా ప్రాణరక్షణకు చంపాను. మానరక్షణకు చంపాను. మోసం, ద్రోహం, కుట్రలను చంపాను. నాకు శిక్ష పడదు. పడరాదు. ఇక మరొకరు నాతో శిక్ష అనుభవించటం జరగదు.'

తల్లిదండ్రులు, డాక్టర్లు, తన లాయరు ఎబార్షన్ సూచించారు. ఆరతి అంగీకరించలేదు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆరతిని మాటలతో, సూచనలతో, ప్రశ్నలతో హింసించసాగాడు.

ఆరతి మొదట ఏడ్చింది. తరవాత గుండె దిటవు చేసుకొంది. ఇబ్బంది పెట్టే ప్రశ్నలు అడుగుతుంటే ఒకదశలో తిరగబడింది.

'నువ్వు మగవాడివేనా? నీకు పెళ్ళికాలేదా?'

'కాలేదు!'

'మీ అమ్మానాన్నలకు పెళ్ళయిందికదా, ఆడమనిషి మగమనిషి ఏంచేస్తే నువ్వు పుట్టావో తెలుసుకో! తెలియకపోతే మీ నాయన్నడుగు' కోపంతో ఊగిపోయింది.

ఆరతి కడుపుకోసమే చక్రితో కాపురం చేసింది. అతడు నిరాకరిస్తుంటే బలవంతంగా తీసుకుపోయింది. ఇష్టపూర్వకంగా అతడితో భార్యలాగా ప్రవర్తించింది. వాళ్ళిద్దరూ భార్యాభర్తలు లాగానే ఆరాత్రి జీవించారు. పథకంప్రకారం అతణ్ణి చంపింది. ఆమె ప్రయోజనాలు రెండు. అవమానానికి ప్రతీకారం. సంపన్నుడైన అతడి ఆస్తిలో పుట్టిన ప్రాణికి వాటా పొందటం, తాను విచ్చలవిడిగా తిరగడం-

'షటప్!'

'ఏమి?'

'నేను విచ్చలవిడిగా తిరగడం అనే మాట అనరాదు'

'ఎందువల్ల!'

'అది భవిష్యత్తు!'

'అయితే!'

'అది ఇప్పుడే ఊహించటం కష్టం'

'ఉద్దేశమే అది అని అందుకే ఈ కుట్ర అంతా అని'

'నేను చెప్పని నా ఉద్దేశం అదీ అని-'

'ఊహించవచ్చు'

'ఊహించరాదు, ఊహవాస్తవం కాదు. ఊహకు న్యాయస్థానంలో ఈకేసులో చోటులేదు'

'ఏం చేయాలని మీసంకల్పం?'

'చాలా ఊహిస్తున్నారు కదా! ఊహించి ఆనందించండి.'

ఆరతి బుద్ధి పూర్వకంగా చక్రిని లాలించి తీసుకుపోయి, ఉద్రేకపరిచి, ఆరాత్రి గడిపి, తెల్లవారు జామున నిద్రలో ఉన్నప్పుడు గొంతు పిసికి చంపిందని వివరించి, ఆమె ఇష్టపూర్వకగా అతడితో ఆ రాత్రి గడపింది అని కోర్టును ఒప్పించటానికి సూదీదారం ప్రయోగం చేసి, అది బుద్ధి పూర్వకంగా జరిగిందేకాని, బలవంతపు మానభంగం కాదని స్పష్టంచేశాడు.

డిఫెన్సు లాయరు చక్రి తనకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవటానికి బాగున్న కారును, చెడిపోయిందని రోడ్డు మధ్యలో ఆపి, ఆమెను లిఫ్టు అడిగి, మోసంగా ప్రవర్తించి, పెద్దమనస్సుతో ఆమె అతణ్ణి క్షమించి, లిఫ్టు ఇస్తే, మత్తుమందు వాసన చూపి, ఆమె స్పృహ కోల్పోతే, కారు ఆపి, తాను డ్రైవ్ చేసి, తన గెస్ట్‌హౌస్‌కు తీసుకువచ్చి, వాచ్‌మేన్ సహాయంతో బెడ్‌రూంకు తీసుకుపోయి, కాళ్ళు చేతులూ, మెడా, నడుం కట్టివేసి, స్పృహ వస్తున్నప్పుడల్లా మత్తుమందు వాసన చూపుతూ, ఆమెను రాత్రంతా, ఆమె ప్రమేయం లేకుండా అనుభవించి, ఆమె శరీరంమీద గెలుపును సాధించిన విజయగర్వంతో మత్తుమందు తగ్గించి, పాక్షికంగా మెలకువ తెప్పించి, ఆమె చేత తనకిష్టమైన పనిచేయించుకొని, ఆమె ఇష్టంమీద, బుద్ధిమీద, ఆలోచనలమీద కూడా గెలుపు పొందటానికి చేతుల కట్లు విప్పి, మనిషంతా కట్టివేయబడి ఉంది కదా, మరేం చేయలేదనుకొని పొరపాటుచేసి, ఆమె చేతులకు దొరికి చనిపోయాడు. చక్రి చనిపోకపోతే, మానభంగం హత్యలకు ఆరతి గురి అయ్యేది. చనిపోయేది. తన ప్రాణరక్షణ కోసం అతడి గొంతు పిసికింది కానీ, అతణ్ణి చంపే ఉద్దేశం ఆమెకు లేదు. చక్రి చనిపోయాడని తెలిసిన తరువాత తను గొంతు పిసకటం వల్లె అతను చనిపోయాడని భావించి తాను చంపానంది కానీ, బుద్ధిపూర్వకంగా చంపలేదు. పథకం ప్రకారం చంపలేదు.

ఆమె మానప్రాణ రక్షణ ప్రయత్నంలో చక్రి చనిపోయాడు' అని తేల్చి చెప్పాడు.

ఆ రోజు రాత్రి డిఫెన్సు లాయరును, ప్రాసిక్యూటర్‌ను చక్రి తల్లిదండ్రులు అన్నలు వాచ్‌మేన్ కలిసి, తమ చక్రి పొరపాటు చేశాడని, ఆమెమీది పిచ్చి ఇష్టంతో ఇంత అపరాధం చేశాడని, మానభంగం చేస్తే పెళ్ళికి ఇష్టపడుతుందని, గత్యంతరం లేక పెళ్ళికి ఒప్పుకొని సంసారానికి వస్తే క్షమాపణ కోరి తనను అనుకూలంగా చేసుకోవచ్చునని ప్రయత్నించాడేకాని ద్రోహచింతన లేదని కోర్టులో చెప్పమన్నా చెబుతామని స్పష్టం చేశారు.

చక్రివల్ల ఆమె కడుపు వచ్చి తల్లికాబోతూ ఉందంటే మాకు బాధగా ఉంది. ఆమె ఎబార్షన్ చేయించుకోనంటుంటే మాకు ముచ్చటేసింది. మా వంశాకురం ఆమె కడుపులో పెరుగుతున్నాడని ఆనందంగా ఉంది. ముగ్గురు కొడుకుల్లో పెద్దవాళ్ల కిద్దరికి పెళ్ళయినా పిల్లలు లేరు. చక్రికి పెళ్ళికాకపోయినా సంతానం కలగబోతూ ఉంది. అందుకు మాకు ఆనందంగా ఉంది. చక్రితో ఆరతికి పెళ్ళికాకపోయినా, శోభనం అయి గర్భవతి అయింది కాబట్టి, ఆమెను మేము కోడలుగానే గ్రహిస్తాం. కోడలుగా అన్ని హక్కులతో మాయింటిలో ఆరతి ఉండవచ్చు. మీకిష్టమయితే, మీరామెను ఆమె కుటుంబాన్ని ఒప్పిస్తే, మేం వాళ్ళతో మాట్లాడి, ఆరతిని కోడలుగా ఇంటికి తెచ్చుకొంటాం' అన్నారు వాళ్ళు.

'మీది మంచి ఆలోచన. మంచి మనస్సు. నేను మాట్లాడతాను' అన్నాడు డిఫెన్సు లాయరు.

'ఆమె మీ ఇంటికి వస్తే విధవగా ఉండాలి కదా!' అన్నాడు రవీంద్ర.

'అవును అంతకంటే ఏంచేయగలం?'

'ఇక ఆరతి పెళ్ళికాని విధవ!'

'ఏంచేస్తాం? అంతే పరిస్థితి.'

'భర్త సుఖం తెలియని భార్య. తన ప్రమేయంలేకుండా తనకు పుట్టిన సంతానం. మీకిది న్యాయంగా ఉందా?

'ఆమెకు మేమెట్లా న్యాయం చేయగలం?'

'ఇష్టంవల్ల చక్రి ఆమె బ్రతుకు నాశనం చేశాడు. ప్రేమవల్ల, వంశాంకురం పట్ల ఆశవల్ల, మీరు ఆరతిని జీవితాంతం మొగుడు లేకుండా ముండమోపిగా ఉండమని, మీ ఆదరణతో శపించబోతున్నారు'

'ఆరతికి న్యాయం చేయాలి.'

'ఇది న్యాయంకాదు. అన్యాయం.'

'పెళ్ళి జరిగితే న్యాయమే కాని-ఎవరు చేసుకొంటారు?

'ఎవరైనా చేసుకోవచ్చు'

'నీలాంటి బుద్ధిమంతుడు. యోగ్యుడు అర్హుడు దొరుకుతాడా?'

'లోకం గొడ్డుపోలేదు.'

'బిడ్డ తల్లైన యువతిని ఎవరు చేసుకొంటారు?'

'ఎవరైనా చేసుకోవచ్చు. చెప్పలేం?'

పోనీ ఈ సహాయంచేయమని వాళ్ళందరూ ఒక్కుమ్మడిగా అడిగి ఆమెతో ఆమె తల్లిదండ్రులతో రాయబారం చేయమని వీళ్ళిద్దరినీ అడిగారు.

'నేనీ పనిచేయను' అన్నాడు రవీంద్ర.

'ఎందుకు చేయరు?' డిఫెన్సు లాయరు అడిగాడు.

'చక్రి ఆమెకు తెలియకుండా కడుపు చేశాడు. భర్త సుఖం ఆమెకు తెలియదు. వీళ్ళు ఆమెను కోడలుగా అంగీకరిస్తున్నారు. జీవితాంతం భర్త లేకుండా ఒంటరిగా ఎండిన మోడును చేయాలని చూస్తున్నారు. ఇప్పటికీ చాలా నష్టపోయిన ఆరతి మరింత నష్టపోవటం నాకిష్టం లేదు.'

'ఆమెకేమి నష్టం! కోడలుగా అన్ని అర్హతలు పొందుతుంది. మేలేకదా?' డిఫెన్సు లాయరు.

'ఇష్టంలేని కడుపు వచ్చింది. ప్రాణరక్షణకు చేసిన పని హత్యానేరంగా మెడకు చుట్టుకొంది.'

'ఆమె కోరి కడుపు తెచ్చుకోలేదా?'

'లేదు!'

'ప్రాణరక్షణకే చక్రి గొంతు పిసికిందా?'

'అవును!'

'మరి మీరు కోర్టులో చేసే వాదన?'

'ప్రాసిక్యూటర్ పని!'

'డిఫెన్సు లాయరు గెలిస్తే?'

'మీరు గెలుస్తారని నాకు తెలుసు!'

'ఆమెకు విముక్తి వస్తుంది!'

'వస్తుందని తెలుసు!'

'ఆమెకు పెళ్ళి అవుతుంది!'

'అవుతుందని తెలుసు!'

'భర్త ఆమెను, ఆమె బిడ్డను ఆదరిస్తాడని తెలుసా?'

'తెలుసు! కానీ ఆదరిస్తానని వచ్చేవాణ్ణి ఆమె ఆదరిస్తుందో లేదో తెలియదు.'

'ఆదరిస్తుంది!'

వీళ్ళ గొడవల్లో వీళ్ళుండగా తల్లి దండ్రులు మళ్ళీ తమ గోడు తాము వెళ్ళబోసుకోసాగారు.

'మా వంశాంకురాన్ని కని మాకిస్తే, మేం బిడ్డను చక్రిలాగా చూచుకొంటాం పెంచుకుంటాం అన్ని అర్హతలు కల్పిస్తాం. అందుకు ఆరతిగానీ ఆమె తల్లిదండ్రులుగానీ ఏంచేయమన్నా చేస్తాం. వాళ్ళను మీరు దయతో ఒప్పించాలి.'

డిఫెన్సు లాయరు ప్రయత్నిస్తానన్నాడు. రవీంద్ర 'ఆమె ఒప్పుకోదు' అన్నాడు.

'మాకు మా వంశాంకురం ప్రసాదించండి' అని వాళ్ళు చేతులు పట్టుకొన్నారు.

మరునాడు ఉదయమే డిఫెన్సు లాయరు ఆరతి వాళ్ళ ఇంటికి పోయాడు. రాత్రి చక్రి కుటుంబంతో తమ ఇద్దరి మధ్య జరిగిన సంభాషణ అంతా వివరించాడు. చివరికి అడిగాడు.

'వాళ్ళింటికి కోడలుగా పోతావా?'

'పోను!'

'మరి పెళ్ళిచేసుకుంటావా?'

'చేసుకొంటాను!'

' ఈ బిడ్డను కంటావా?'

'కంటాను!'

'వాళ్ళికిస్తావా?'

'ఇవ్వను'

'ఏంచేసుకొంటావు?'

'పెంచుకొంటాను!'

'వచ్చే భర్త నిన్ను ఇష్టపడి బిడ్డ వద్దంటే–'

'అతన్ని పెళ్ళిచేసుకోను!'

'బిడ్డనూ నిన్నూ ఇష్టపడే వాళ్ళు ఉంటారనుకొంటున్నావా?'

'ఉంటారు!'

'లేకపోతే!'

'పెళ్ళిచేసుకోకుండా ఉంటాను'

'ఎందుకంత పట్టుదల?'

'నేనెన్నో పోటీల్లో పాల్గొన్నాను. ఎన్నో బహుమతులు గెలిచాను. మెడల్స్, కప్స్, మెమెంటోస్- ఎన్నో ట్రోఫీలు. నాకు తెలియకుండా నేనీ పోటీలో పాల్గొన్నాను. గెలిచాను. కడుపులో బిడ్డ నాకు వచ్చిన బహుమతి. పుడితే ఆ బిడ్డ నా ట్రోఫీ.

'పుట్టబోయే బిడ్డ చక్రి సంతానం'

'వాడెవడో నాకు తెలియదు. వాడవునో కాదో నాకు తెలియదు. తల్లి కాగలగటం నా అర్హత. గర్భవతిని కావటం నా గెలుపు. పుట్టే బిడ్డ నా ట్రోఫీ! అది నాకు తప్ప, ఎవరికీ చెందదు, ఎవరి సొంతం కాదు: నా సొంతం!'

డిఫెన్సు లాయరు ఏమీ మాట్లాడలేదు. తల్లిదండ్రులు మౌనంగా ఉన్నారు.

కోర్టులో బోనుకు రవీంద్ర కాళ్ళూ చేతులూ మెడా నడుం కట్టేసి 'నన్నిట్లా మంచానికి పడుకోబెట్టి కట్టేశారు' అంది కోర్టులో ఆరతి. మీరు నా అంత ఎత్తున్నారు. నా అంత బలంగా ఉన్నారు. విడిపించుకోగలరా? విడిపించుకోలేరు. నేనూ విడిపించుకోలేను. మీరు మెలకువగా ఉన్నారు. నేను స్పృహ లేకుండా ఉన్నాను. మత్తువల్ల పడి ఉన్న మనిషితో వాడు క్రీడించాడు. మామూలుగా ఉన్న మీ మీద ఈ ప్రయోగం. ఇది సిరంజి. ఇందులో తేనె ఉంది. దీనికి సూది లేదు. ఇది పశువులకు ఇంజెక్షన్ ఇచ్చే సూది. దీనితో మీ నోట్లో తేనె ఇంజెక్ట్ చేస్తాను. పూర్తిగా అంతా ఇంజెక్ట్ చేస్తే నోరు నిండిపోతుంది. మీరు మింగకూడదు. మింగితే మీరు ఇష్టపూర్వకంగా మింగినట్లు. మింగకపోతే మీరు తిరస్కరించినట్లు. సరేనా?'

'సరే' అన్నాడు రవీంద్ర. కోర్టు అంతా ఆశ్చర్యంగా చూస్తూ ఉంది. జడ్జికి ఆసక్తిగా ఉంది.

పెద్ద చిరంజితో ఉన్న తేనె మొత్తం రవీంద్ర గొంతులోకి ఇంజెక్ట్ చేసింది. తేనె బయటికి వస్తుంటే నోరుమూసింది. బుక్కలు నొక్కింది. రవీంద్రకు ఊపిరాడలేదు. రెండు నిమిషాలు నోరు తెరవనీయలేదు. వొత్తుతూనే ఉంది. స్పిటాన్ తెప్పించి అందులో ఉమ్మివేయించింది. మూతికడిగింది. తుడిచింది. కట్లు విప్పింది. ప్రశ్నించింది.

'మీ నోట్లో ఇంతదాకా ఉన్నది తేనేనా?'

'తేనే!'

'తీయగా ఉందా? చేదుగా ఉందా?'

'తీయగా ఉంది!'

'సరిగ్గా చెప్పండి! చేదుగా లేదా?'

'లేదు!'

'మీరు మింగినట్టు నాకు అనుమానం! మింగకపోతే రుచి ఎలా తెలిసింది?'

'మింగకపోయినా, తీపి నోట్లోనే తెలుస్తుంది'.

'మీరు మింగకపోయినా తేనె గొంతులోకి జారి ఉండవచ్చు!'

'జారలేదు!'

'జారే అవకాశం ఉంది. తేనె ప్రాణంలేనిదే అయినా జారి లోపలికి పోవచ్చు' ఆరతి

'పోదు!'

'పోయి ఉంటుందేమో!'

'పోలేదు' రవీంద్ర.

'తేనె ప్రాణంలేనిది కాబట్టి పోకపోవచ్చు! కానీ, ఇష్టంలేని మనిషే అయినా బంధించి ఉంచినప్పుడు, పడ్డ స్పెర్మ్ లోపలికి పోకుండా ఆపుకోలేదు. స్పెర్మ్‌కి ప్రాణం ఉంది. పైకి, లోనికి పాకుతుంది. నన్ను కట్టేయటంవల్ల, స్పృహలేకుండా చేయటంవల్ల, నా ప్రమేయం లేకుండా లోనికి ఏమైనా ప్రవేశించినా, గర్భం వచ్చినా అది నేను ఇష్టపడి, అంగీకరించి ఆహ్వానించి పొందిన రతి కానక్కరలేదు కదా!'

'కాదు. ఇష్టంలేకపోతే సూదిలో దారం ఎక్కనట్లే ప్రవేశం జరగదు.'

'ఇష్టంలేకపోయినా గొంతులోకి తేనే జారినట్లు స్పెర్మ్ ప్రవేశించవచ్చు.'

'కాదు!'

'నేనిప్పటికీ ఒక హత్యానేరంలో ఇరుక్కున్నాను. నా ప్రమేయం లేకుండా! నాకు శిక్ష పడాలని మీరు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరో హత్య నేనే చేసినా పడే శిక్ష ఒక్కటే! మీరు తేనె మింగి ఉండకపోతే బతుకుతారు. మింగి ఉంటే చనిపోతారు.'

'ఏమంటున్నారు?'

'తేనె మింగినా, మీ ప్రమేయం లేకుండా గొంతులో నుంచి కడుపులోకి తేనె జారినా మీరు చచ్చిపోతారు.'

కోర్టు నిశ్శబ్దంగా ఉంది. జడ్జి ఆశ్చర్యంతో చూస్తున్నారు. లాయర్లు బిత్తరపోయారు.

'నేను తేనెలో విషం కలిపాను' ఆరతి ముగించింది.

రవీంద్ర వాంతి చేసుకోవటానికి ప్రయత్నించాడు. కుదరలేదు. డోక్కున్నాడు. ఏమీ రాలేదు. కడుపు తిప్పుతున్నట్లుగా ఉంది. ప్రమాదం సూచన ప్రాయంగా కనబడుతూ ఉంది. డాక్టర్లు కోర్టులో ఉన్నారేమోనని చూశాడు. ఎవరూ లేరు. పరుగు పరుగున జడ్జి దగ్గరకు పోయి హాస్పటల్‌కి పోవటానికి కడుపు వాష్ చేసుకోవటానికి అనుమతి కోరాడు. 'నా అంతట నేను పోతాను అంబులెన్సు తెప్పించండి. పోలీసు ఎస్కార్టు అరేంజి చేయించండి.'

జడ్జి సరే నన్నాడు. అందరికీ సూచనలిచ్చాడు. అంబులెన్సు కోసం ఆగవద్దు, పోలీసు వేన్‌లో హాస్పటల్‌కి తీసుకు పొమ్మని జడ్జి చెప్పాడు.

పోలీసులు బస్సు తెచ్చే ముందు జడ్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ని అడిగాడు. 'విషం ఉన్న తేనె మింగావా?'

'మింగాను'

'మింగకూడదని కదా నీ నిర్ణయం!'

'నా ప్రమేయం లేకుండా మింగేశాను. నేను చచ్చిపోతాను. నన్ను తీసుకుపొండి. చికిత్స చేయించండి.

ఇంకా పోలీసు వేన్ రాలేదు.

'ఆరతి నిర్దోషి అని నాకు తెలుసు. అన్యాయంగా ఒక దుర్మార్గానికి బలయిందని నేను బాధపడ్డాను. కానీ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నా బాధ్యత నిర్వర్తించాను. కానీ ఇప్పుడు నన్ను చంపి ఆమె హంతకురాలయిందే అని నా బాధ' అని రవీంద్ర కోర్టులో కూలబడ్డాడు.

ఆరతి జడ్జి అనుమతితో బోను దిగి వచ్చి, రవీంద్ర ముఖం మీద నీళ్లు జల్లి, కోటుతీసి 'రవీంద్రగారూ! నేను తేనెలో విషం కలపలేదు. నిజం నా వాదం కోసం ఇలా నటించాను.'

రవీంద్ర లేచి కూర్చున్నాడు. 'నిజమా' అన్నాడు. 'నిజమే' అంది.

'న్యాయ మూర్తిగారూ! న్యాయం చేయండి. నేను తేనెలో విషం కలపలేదు'.